క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి ఉమాకమండలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రెండో రోజు ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఉద్యాసనపూజ, మండప పునఃపూజలు, హోమాలు, ధాన్యాధివాసం, మధ్యాహ్నం ఉదకశాంతి, అభ్యంగనం, పంచశయ్యాధివాసం, పుష్పాధివాసం, నీరాజన మంత్రపుష్పం, చతుర్వేదస్వస్తి తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. పూజలో జెడ్పీటీసీ బోణం సాయిబాబు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ఘనంగా కనకమహాలక్ష్మి తీర్థం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో వేంచేసిన గ్రామదేవత కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర తీర్థం శుక్ర, శనివారాలు ఘనంగా జరిగింది. విద్యుత్ దీపాల అలంకరణతో తీర్థ మహోత్సవాలు ఆలయ కమిటీ నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవార్ని దర్శించుకోవడానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వాడపల్లి వెంకన్నకు విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు అందినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. మియాపూర్‌కు చెందిన కె.లక్ష్మీనారాయణాచార్యులు–అరుణ దంపతులు రూ.21,116, చిన్నఅమిరానికి చెందిన వి.వెంకట సూర్యనారాయణరాజు–వెంకటలక్ష్మి దంపతులు రూ.10,111 విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

జగనన్న పాల వెల్లువ, వైఎస్సార్ బీమాపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాతి బుజ్జి

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్న పాల వెల్లువ, వైఎస్సార్ బీమా తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో నాతి బుజ్జి, వైద్యాధికారులు సుస్మిత, సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ నాతిబుజ్జి మాట్లాడుతూ వలంటీర్లు నిర్వహిస్తున్న జగనన్న పాల వెల్లువ సర్వే విషయంలో వలంటీర్లు రైతులకు సరైన అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వెటర్నరీ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడులో శుక్రవారం మానవ హక్కుల కమిటీ చైర్మన్ ముత్యాల శ్రీనివాసరావు సమకూర్చిన మజ్జిగను జేఎస్పీ నాయకుడు బొంతు రాజేశ్వరరావు పంపిణీ చేశారు. సర్పంచ్ ముప్పర్తి అలివేలు మంగతాయారు, ఎంపీపీ వీరా మల్లిబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పర్తి నాని, ఫీల్డ్ అసిస్టెంట్ కె.అగస్టీన్ కుమార్, స్థానికులు ఎం.నాని ప్రసాద్, దొమ్మేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్లను అడ్డుకుంటున్నారు

అంబాజీపేట: రైతులు సాగు నిమిత్తం వారి పొలాల్లో మట్టిని ట్రాక్టర్ల ద్వారా తొలగిస్తుంటే కొంత మంది అధికారులు రూ.316 ట్యాక్స్ వసూలు చేస్తూ అడ్డుకుంటున్నారని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు ఆరోపించారు. అంబాజీపేటలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళను కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

అయినవిల్లి: పాత గొడవల నేపథ్యంలో ఓ మహిళపై కత్తితో దాడి చేసిన వ్యక్తిపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. అయినవిల్లి గ్రామానికి చెందిన నేదునూరు వెంకటలక్ష్మి పొలం నుంచి గేదె పాలు తీసుకుని వస్తుండగా అదే గ్రామానికి చెందిన నొండ్రు సంజీవరావు పాత గొడవల నేపథ్యంలో కాపుకాచి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. దీనిపై పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామీణ వైద్యాలయాలు..

- హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు
- జిల్లాలో 432 హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు
- క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్య సదుపాయాలు



తాటిపాకలో ప్రారంభమైన హెల్త్ వెల్‌నెస్ సెంటర్

రాజోలు: ఆరోగ్యమే మహాభాగ్యం నానుడితో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలను అందించేందుకు శ్రీకారం చుట్టింది. కొద్దిపాటి అనారోగ్యానికి, చిన్న చిన్న వైద్య సమస్యలకు కిలోమీటర్ల దూరం వెళ్లి గ్రామానికి తిరిగి వచ్చేలోగా ఏ జ జరుగుతుందో తెలియని పరిస్థితులను అధిగమించి కూతవేటు దూరంలోనే వైద్యసేవలు అందించేందుకు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులోకి తీసుకు వచ్చారు. గ్రామం నుంచి ఒకటి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) లేదా సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ)కి వెళ్లనవసరం లేకుండా ప్రాథమికంగా గ్రామంలోనే వైద్యసేవలు, వైద్య పరీక్షలు పొందేందుకు వీలుగా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఎంతగానో ఉపయోగపడతాయి. గ్రామాల్లో ఉండే వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఈ సెంటర్ల ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో 432 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీటిలో దాదాపుగా అన్ని చోట్ల హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు పనులు ప్రారంభమయ్యాయి. రాజోలు నియోజకవర్గంలో సుమారు 40 వెల్‌నెస్ సెంటర్ల పనులు ప్రారంభం కాగా తొలిదశలో తాటిపాక గ్రామ సచివాలయం పరిధిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రారంభించారు.

ఇవీ సదుపాయాలు..

సుమారు 2 వేల నుంచి మూడు వేలు జనాభా కలిగిన ప్రతి గ్రామసచివాయం పరిధిలో హెల్త్ వెల్‌నెస్ సెంటరు ఉంటుంది. సెంటర్ 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ), గ్రామ సచివాలయ ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉంటారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. అలాగే సుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు చేసేందుకు అత్యాధునిక కిట్లు ఏర్పాటు చేశారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు భవనాలు పూర్తి కాని చోట్ల గ్రామ సచివాలయల్లోను, అద్దె భవనాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వృద్ధులు, గర్భిణులకు నిరంతరం వైద్యబృందం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. ఆర్ఎంపీ, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించకుండా నేరుగా హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చు. సెంటర్‌కు వచ్చే రోగులను ఎంఎల్‌హెచ్‌పీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వారి ఆరోగ్యం మెరుగుపడే వరకు వైద్యసూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఈ సెంటర్ పరిధిలో నెలలో రెండు పర్యాయాలు ప్రభుత్వం నియమించి డాక్టర్స్ 104 వాహనం ద్వారా వచ్చి వైద్యసేవలు అందిస్తారు. వైద్యులు సూచించిన వైద్య పరీక్షలను చేసి మందులను ఉచితంగా అందజేస్తారు. హెల్త్‌వెల్ నెస్ సెంటరు పరిధిలో ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్స చేయించుకున్న రోగులను, పక్షవాతం, ఇతర రోగాలతో మంచానికి పరిమితమై కేంద్రాల వద్దకు రాలేని పరిస్థితిలో ఉన్న రోగులను పరీక్షించేందుకు ఇంటింటికీ వెళ్లి వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా నెలకు రెండు పర్యాయాలు వైద్య సేవలు అందించేందుకు వచ్చే డాక్టర్‌తో ఏదైనా అత్యవసర సమయాల్లో వైద్య సలహాలు తీసుకునేందుకు సెల్‌ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ఫోన్ నంబర్‌ను కూడా అందుబాటులో ఉంచారు. సచివాలయ పరిధిలో ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్‌గా వైద్యసేవలు అందించేందుకు ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ఎంతో మేలు చేస్తుందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యసేవలు అందుబాటులో ఉంచాం



హెల్త్‌వెల్‌నెస్ సెంటరుకు వచ్చే రోగులకు ప్రాథమిక వైద్యసేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. పూర్తిస్థాయిలో ఆరోగ్య సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. 105 రకాల మందులు, 14 రకాల వైద్యపరీక్షలు చేస్తారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలకు గ్రామంలోనే వైద్యం పొందవచ్చు.

– సీహెచ్ ఫణికిరణ్, వైద్యాధికారి, తాటిపాక పీహెచ్‌సీ

మెరుగైన వైద్యం కోసమే ఏర్పాటు



హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు గ్రామీణ వైద్యాలయాలుగా పేరు వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకు వీటిని ఏర్పాటు చేశారు. తొలి వెల్‌నెస్ సెంటర్ తాటిపాకలో ప్రారంభం కావడం సంతోషంగా ఉంది.

– బొంతు రమేష్, తాటిపాక

వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి



ఊడిమూడి వద్ద నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ఊడిమూడి వద్ద ప్రధాన పంటకాలువపై నిర్మిస్తున్న వంతెనను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే చిట్టిబాబు అన్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కోసం సీఎం జగన్ వశిష్ఠ నదీపాయపై వంతెన నిర్మాణానికి రూ.49.5 కోట్లు మంజూరు చేసిన విషయం విదితమే. ఈ ప్యాకేజీలో భాగంగా ప్రధాన పంట కాలువపై వంతెన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను చిట్టిబాబు పరిశీలించారు. పంట కాలువలకు సాగునీరు విడుదల చేసిన నేపథ్యంలో మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు సంస్థ అధినేత పీపీ రాజు, నాయకులు గిడ్డి రాంబాబు, సాధనాల రమేష్, దొమ్మేటి దుర్గారావు, పందిరి పూర్ణచంద్రరావు, బొంతు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడిపూడిలో గడప గడపకూ..

ఆత్రేయపురం: మండలంలోని తాడిపూడిలో శనివారం మధ్యాహ్నం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

మహాజ్యేష్టాభిషేకానికి సప్తనదీ జలాలు సిద్ధం



అంతర్వేది ఆలయానికి చేరిన సప్తనదీ జలాలు

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహుని దేవస్థానంలో ఈ నెల 4న స్వామి వారి మూలవిరాట్‌కు నిర్వహించనున్న మహాజ్యేష్టాభిషేకానికి వేర్వేరు ప్రాంతాల్లోని సప్తనదుల్లోని జలాలను సిద్ధం చేసినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ శుక్రవారం చెప్పారు. ఈ మేరకు మహాజ్యేష్టాభిషేకంలో వినియోగించే గంగా, యమున, సరస్వతి, గోదావరి, నర్మద, సింధు, కావేరి పుణ్య నదుల్లోని జలాలను ఆలయంలో సిద్ధం చేసినట్టు ఆయన చెప్పారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు, అర్చకులు ఈ విశేష కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. కాగా మహాజ్యేష్టాభిషేకం, మహాశాంతి హోమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపా కటాక్షవీక్షణమును పొంది, తీర్థ ప్రసాదాలను స్వీకరించవలసిందిగా అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ కోరారు.

నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యం



అంబాజీపేటలో క్రికెట్ క్రీడాకారులతో జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా

అంబాజీపేట: ఏకాగ్రత, పట్టుదలతో నిరంతర సాధన చేయడంతోనే విజయాలు సాధ్యమవుతాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. అంబాజీపేట జడ్పీ హైస్కూల్లో గట్స్ అండ్ గ్లోరీ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఉమ్మడి గోదావరి జిల్లాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జంధ్యాల శివకుమార్ అధ్యక్షతన క్రికెట్ క్రీడాకారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు చిన్నతనం నుంచి టీం వర్క్ కోసం నిస్వార్థంగా కృషి చేసిన రోజున మంచి గుర్తింపు వస్తుందన్నారు. క్రికెట్ కోచ్‌లు ఇచ్చే శిక్షణను ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకొని రాణించాలన్నారు. అనంతరం గట్స్ అండ్ గ్లోరీ నిర్వాహకులు మధిర నరసింహం–ఉష దంపతులు సమకూర్చిన టీ షర్టులు, క్యాప్‌లను క్రికెట్ క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో గట్స్ అండ్ గ్లోరీ జిల్లా అధ్యక్షుడు మహాదశ సురేష్‌కుమార్, తహసీల్దార్ టి.మంగతాయారు, ఆర్ఐ ఇబ్రహీం, పంచాయతీ కార్యదర్శి జీవీవీకే కుమార్, వీఆర్‌ఓ పీవీ రమణ, క్రికెట్ కోచ్‌లు మట్టా సత్తిబాబు, నగేష, ఆక్వా కమిటీ చైర్మన్ కామిశెట్టి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే చిట్టిబాబు తదితరులు

అయినవిల్లి: ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా వలంటీర్లు ఉంటూ విశిష్టమైన పాత్రను పోషిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం తొత్తరమూడి, విలస గ్రామాల్లోని సచివాలయ భవనాల వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వారిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సత్కరించి, ప్రోత్సాహకాలు అందజేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థపై నమ్మకం ఉంచారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందివ్వడంలో వలంటీర్లు ప్రముఖ పాత్రను పోషిస్తున్నారన్నారు. ఎంపీడీఓ తాడి శ్రీ వెంకటాచార్య, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, తొత్తరమూడి సర్పంచ్ వార జయసావిత్రి, విలస సర్పంచ్ కుసుమ లిల్లీ మంగేష్కర్, పంచాయతీ కార్యదర్శులు గరిమళ్ల రవి, ఆదిశంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు వార లక్ష్మీనరసింహరామ్, కుసుమ సునీల్‌కుమార్, రాయుడు శ్రీను, జోషికుమార్, పులిదిండి ప్రభాకర్, బొంతు రాజేంద్రప్రసాద్, కాశి సత్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా చేద్దాం



మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలమూరు: మండలాన్ని అన్ని రంగాల్లో ఎంపీటీసీ సభ్యుల సహకారంతో అగ్రగామిగా నిలుపుదామని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అన్ని శాఖల అధికారులు ప్రగతి సాధించిన నివేదికలను సమావేశంలో వివరించారు. పలువురు ప్రజా ప్రతినిధులు సమస్యలను ఏకరవు పెట్టారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో సంబధిత అధికారులు చురుకుగా పనిచేయాలన్నారు. అలాగే ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకూడదన్నారు. త్వరితగతిన సమస్యలు పరిష్కరించి ప్రణాళికా బద్ధంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, తహసీల్దారు ఐపీ శెట్టి, ఎంఏఎస్‌సీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి



విద్యార్థి రూపొందించిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్సై జానీబాషా

మామిడికుదురు: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నగరం ఎస్సై షేక్ జానీబాషా సూచించారు. రాజమహేంద్రవరం శ్రీచైతన్య స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న అప్పనపల్లికి చెందిన పసుపులేటి గుణసాత్విక్ సమ్మర్ ప్రాజెక్టు రిపోర్టును శుక్రవారం నగరం ఎస్సైకు సమర్పించారు. దాన్ని పరిశీలించి ఎస్సై బాషా మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు వ్యవసాయంతో పాటు మహిళల హక్కులు, బాలికల సంరక్షణ, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించుకునే విధంగా విద్యార్థులను యాజమాన్యం ప్రోత్సహించడం ముదావహమన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు తమ చుట్టూ జరిగే సామాజిక అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఇది భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని ఎస్సై పేర్కొన్నారు.

లబ్ధిదారులకు ముందుగా తెలియజేయండి

అంబాజీపేట: ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు ఇబ్బందులకు గురికాకుండా ముందుగా తెలియపరిస్తే కావాల్సిన పత్రాలను సిద్ధం చేసుకుంటారని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంక పంచాయతీ కార్యాలయం వద్ద హౌసింగ్ లోన్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ రేవతి మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటామని, సగంలో నిర్మాణంలో ఉన్నవారు 49 మంది ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు వద్ద వివరించారన్నారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. లబ్ధిదారులందరితో మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో వీఆర్వో డీవీ రాఘవులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయం



పాశర్లపూడిలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: జగన్ పాలనకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని, మళ్లీ వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు జోస్యం చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం పాశర్లపూడిలో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే చిట్టిబాబు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అమలు కావాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారని చిట్టిబాబు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సంక్షేమ ప్రదాత జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా వెన్నుదన్నుగా నిలవాలన్నారు. మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్లు యాదీవీ సత్యనారాయణ, కటకంశెట్టి ఆదిత్య, గ్రామ శాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ మొల్లేటి త్రిమూర్తులు, పార్టీ నాయకులు తోరం సూర్యభాస్కర్, తులా గోపాలకృష్ణ, పేరి శ్రీనివాస్, గెద్దం జగదీష్, పాలమూరి గోపాల్ పాల్గొన్నారు.

అమృత్ సరోవర్‌లో 70 చెరువుల సుందరీకరణ



అప్పనపల్లిలో ఉపాధి పనుల్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ, ఇన్‌చార్జ్ డీపీఓ మధుసూదన్

మామిడికుదురు: అమృత్ సరోవర్ పథకంలో భాగంగా జిల్లాలో 70 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టామని ఇన్‌చార్జ్ డీపీఓ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ తెలిపారు. ఆయన శుక్రవారం అప్పనపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్ని పరిశీలించారు. బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల సుందరీకరణకు సంబంధించి 52 పనులు పూర్తి అయ్యాయన్నారు. మరో 15 చెరువుల పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇంకా ఎనిమిది పనులు చేపట్టాల్సి ఉందన్నారు. జిల్లాలో 89,248 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో 1814 పనులు జరుగుతున్నాయన్నారు. వాటిలో 1198 పంట కాలువల ఆధునికీకరణ పనులు కాగా 62 పనులు కొబ్బరిచెట్ల చుట్టూ పళ్లాలు ఏర్పాటు పనులు జరుగుతున్నాయన్నారు. 27 మట్టి రోడ్ల నిర్మాణం జరుగుతుందని మధుసూదన్ తెలిపారు. సగటు వేతనం, ఆధార్ సీడింగ్‌లో మన జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఏపీఓ మేడిది సీతారామ్, పంచాయతీ కార్యదర్శి కోటయ్య, సచివాలయ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన అంబాజీపేట తైక్వాండో క్రీడాకారులు

అంబాజీపేట: తైక్వాండో పోటీల్లో అంబాజీపేటకు చెందిన 18 మంది క్రీడాకారులు ప్రతిభ కనబర్చి బంగారు, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను సాధించినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తైక్వాండో కార్యదర్శి పితాని త్రిమూర్తులు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులను శుక్రవారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ గత నెల 31న కాకినాడ జిల్లా స్పోర్ట్స్ స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరాలను ప్రోత్సహిస్తూ మినీ ఒలింపిక్స్ గేమ్స్ నిర్వహించారన్నారు. ఈ మినీ ఒలింపిక్స్ గేమ్స్‌లో ఎం.మోక్ష, ఆర్‌డీ లక్ష్మి, ఎం.మౌనిక, బీహెచ్ కార్తీక్, కేఎస్ఆర్ స్వామినాయుడు, ఏబీ చైతన్య, బంగాయ్యలు బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారన్నారు. జెస్సికా, డి.గిరిజ, లాస్య, వినూత్నలు సిల్వర్ మెడల్స్‌ను, కావ్య, చరణ్యశ్రీ, పృథ్వీ, ఎంకే సత్యానందం, వరుణ్, పీఎస్ సాత్విక్, ఆర్ మూర్తిలు బ్రాంజ్ మెడల్స్ పొందారన్నారు. పతాకాలు సాధించిన క్రీడాకారులను హెచ్ఎం బీర హనుమంతరావుతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

జేవీకే కిట్ల పంపిణీ సక్రమంగా జరగాలి



కొత్తపేట స్టాక్ పాయింట్‌లో జేవీకే కిట్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొత్తపేట: జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను విద్యార్థులకు సక్రమంగా పంపిణీ జరిగేలా సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు సీఆర్‌పీలు, ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను శుక్రవారం ఎంపీడీఓ మహేశ్వరరావు సందర్శించారు. ఆ పాయింట్‌లో విద్యాకానుక సామగ్రిని పరిశీలించారు. కానుక పంపిణీలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దాలనే లక్ష్యాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యాకానుక కింద విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూస్, సాక్స్‌లు, బ్యాగ్, బెల్ట్ తదితర వస్తువులు ప్రభుత్వం ఉచితంగా అందచేస్తోందన్నారు. పాఠశాలలు తెరిచిన రోజే కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయాలనే లక్ష్యంతో యుద్ధప్రాతిపదికన కిట్లను మండలాల్లో స్టాక్ పాయింట్లకు చేర్చారన్నారు. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నందున ఆ రోజుకు అన్ని పాఠశాలలకు, ఆయా పాఠశాలల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పంపించే ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్వే

కొత్తపేట: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై గ్రామాల్లో సర్వే కార్యక్రమం చురుగ్గా జరుగుతుందని డీఎల్‌డీఓ పువ్వాడ విజయథామస్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీడీఓ ఈ మహేశ్వరరావుతో వివిధ అంశాలపై సమీక్షించారు. థామస్ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన సర్వేలో భాగంగా హెల్త్ డిపార్ట్‌మెంట్ ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, 6–19 సంవత్సరాల మధ్య కౌమార బాలికల ఆరోగ్యంపై సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రక్తహీనత రహిత సమాజం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సర్వేలో రక్తహీనులను గుర్తించి వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందిస్తామన్నారు. కౌమార బాలికలకు, పాఠశాలల్లో బాలికలకు తగిన పోషకాహారం, ఐరన్ మాత్రలతో పాటు రాగిజావ అందిస్తారన్నారు. మండలాల్లో ఎంపీడీఓల పర్యవేక్షణలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవం



లక్కవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మలికిపురం: పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని లక్కవరం పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించారు. ఎన్‌సీడీ సోషల్ వర్కర్ ప్రమీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పొగాకు ఏ రూపంలో తీసుకున్న తీవ్రమైన అనారోగ్యానికి గురి కావలసి వస్తుందని డాక్టర్ సౌమ్య వివరించారు. రెండు నెలలు పాటు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి పొగాకు తాగడం, నమలడం వలన కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాలలు, కళాశాలలకు సమీపాన ఎలాంటి పొగాకు విక్రయ షాపులు లేకుండా చూడాలన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

అంబాజీపేట: గ్రామంలో జరిగిన భూవివాదానికి సంబంధించిన విషయంలో ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం వక్కలంకకు చెందిన దారా ఆనంద్‌కు గ్రామంలోని మరో సామాజికవర్గంతో కొంతకాలంగా భూవివాదం ఉందన్నారు. ఈ వివాదానికి సంబంధించి ప్రత్యర్థి వర్గం గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తనపై తప్పుడు కేసు పెట్టారని కలత చెందిన ఆనంద్ శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆనంద్‌ను వైద్య చికిత్స నిమిత్తం అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై స్థానిక ఎస్సై ఎ.చైతన్య కుమార్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం రాలేదన్నారు.